సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 6 । ఆగస్టు । 2023

బోథ్‌ను రెవెన్యూ డివిజన్ చేసే అవకాశం ఉందా..



బోథ్: బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందా.. అని ఎమ్మెల్యే బాపూరావు అసెంబ్లీలో శనివారం ప్రస్తావించారు. అలాగే బోథ్‌లో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని, కుప్టి ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు కేటాయించాలని విన్నవించారు.

దరఖాస్తులు నిల్

కైలాస్‌నగర్: జిల్లాలోని మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు ఒక్క దరఖాస్తు కూడా అందలేదు. జిల్లాలోని 40 వైన్స్‌లను లాటరీ విధానంలో కేటాయించేందుకు ఎక్సైజ్‌శాఖ అధికారులు ఈ నెల 4నుంచి దరఖాస్తుల స్వీకరణ చేపట్టారు. అయితే శుక్ర, శని వారాల్లో ఒక్క దరఖాస్తు కూడా అందలేదని జిల్లా ఎక్సైజ్ అధికారి హిమశ్రీ తెలిపారు. ఈ నెల 18 వరకు గడువు ఉందని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
27.0/25.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

కేటీఆర్ నోట.. ముఖరా(కే) మాట



అసెంబ్లీలో ముఖరా(కే) పంచాయతీ ఫొటో చూపుతున్న మంత్రి కేటీఆర్

ఇచ్చోడ: రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్ అసెంబ్లీలో ముఖరా(కే) పంచాయతీ ప్రగతిని శనివారం ప్రస్తావించారు. బోథ్ నియోజకవర్గంలోని ఇచ్చోడ మండలం ముఖరా(కే) చిన్న పంచాయతీ అయినప్పటికీ అభివృద్ధిలో ముందుండి జాతీయస్థాయిలో అవార్డు అందుకుందని వివరించారు. విపక్ష నాయకులు పంచాయతీలకు నిధులు రావడం లేదని ప్రస్తావించడంతో స్పందించిన కేటీఆర్ ఈ జీపీ భవనం, పల్లెప్రకృతి, సేంద్రియ ఎరువులు తయారీ ఫొటోలను చూపించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమే



సన్మానగ్రహీతలతో ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సహజమేనని ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బదిలీపై వెలుతున్న అదనపు ఎస్పీ ఎస్. శ్రీనివాసరావు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వెంకటి, శ్రీపాల్‌కు శనివారం వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ వారిని పూల మాల, శాలువాలతో సత్కరించారు. జ్ఞాపికలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ డీటీసీ సి.సమయ్ జాన్‌రావు, డీఎస్పీలు వి.ఉమేందర్, సీహెచ్ నాగేందర్, పి. శ్రీనివాస్, జిల్లా ఎస్సైలు, సీఐలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లు రిజర్వ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీశ్‌రావును కలిసిన బోథ్ ఎమ్మెల్యే



మంత్రి హరీశ్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే బాపూరావు

బోథ్: మండల కేంద్రంలోని సీహెచ్‌సీని వంద పడకల ఏరియా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ నేపథ్యంలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావును స్థానిక ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు శనివారం కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సత్కరించారు.

జీపీఎఫ్‌పై ఆంక్షలొద్దు



జెడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

కైలాస్‌నగర్: సాధారణ భవిష్యనిధి (జీపీఎఫ్) పై ఆంక్షలు తొలగించి, మంజూరు చేసి పెండింగ్‌లో ఉన్న రుణాలు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. సర్కారు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో జెడ్పీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, 2006–07 నుంచి 2021–22 వరకు ప్రభుత్వం చెల్లించాల్సిన నిధులకు సంబంధించిన వడ్డీ బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జెడ్పీసీఈవో గణపతికి అందజేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆత్రం భుజంగ్‌రావు, నాయకులు బి.రామేశ్వర్, శ్యాంరావు పాల్గొన్నారు.

భారీ జాతీయ జెండా ఏర్పాటు పనుల పరిశీలన

కైలాస్‌నగర్: పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ వద్ద ఎన్‌టీటీ కంపెనీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 150 అడుగుల జాతీయ జెండా నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ శనివారం సాయంత్రం పరిశీలించారు. ప్రగతి వివరాలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అట్టహాసంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కౌన్సిలర్ సతీష్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎంఈవో జయశీల



నీ స్నేహం .. చేతుల్లోనే



- ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌లో మోసాలెక్కువ
- కళ్లముందు స్నేహంతోనే బంధం
- 'సాక్షి డిబేట్'లో ఛాత్రోపాధ్యాయుల అభిప్రాయం

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: అవధులు లేనిది.. అంతస్తులు చూడనిది.. వయసును లెక్క చేయనిది.. ఇష్టాలను పంచుకునేది.. కష్టాల్లో తోడుగా నిలిచేది.. ఇలా ఒకటేమిటి.. ఆ బంధాన్ని తెలిపేందుకు భావాలు సైతం తక్కువైతాయేమో... దాని విలువను వివరించడానికి అక్షరాలు కూడా అరువు తెచ్చుకోవాలేమో... ఆ అనుబంధాన్ని అక్షరీకరించడానికి భాషలు సరితూగవేమో..అదే స్నేహానుబంధం. అయితే మారుతున్న కాలంతో పాటు దోస్తానా మారుతోంది. సాంకేతిక యుగంలో సామాజిక మాధ్యమాల కారణంగా ఎప్పుడో చిన్ననాటి స్నేహితులు దగ్గరవుతుండగా.. మరికొందరు వీటిని ఆసరాగా చేసుకొని మోసానికి దారులు వేసుకుంటున్నారు. ఆదివారం అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని 'సాక్షి' ఆధ్వర్యంలో 'ఆన్‌లైన్ స్నేహంలో నిజాయతీ ఎంత' అంశంపై స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం డిబేట్ నిర్వహించగా పలువురు అధికారులు, ఉపాధ్యాయులు, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు. చాలామంది ఆన్‌లైన్ కన్నా ఆఫ్‌లైన్ స్నేహమే ఉత్తమమన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా పరిచయమైన ముఖ పరిచయం లేనివారితో వ్యక్తిగత విషయాలు పంచుకోవద్దనే అభిప్రాయాన్ని వెల్లడించారు.

'సాక్షి' కృషి అభినందనీయం..



అమ్మానాన్నల తర్వాత విలువనిచ్చేది స్నేహితులకే. స్నేహబంధం గురించి ఎంత చెప్పినా తక్కువే. సాక్షి ఆధ్వర్యంలో ఈ గొప్పబంధం ప్రాధాన్యత తెలిపేలా డిబేట్ నిర్వహించడం అభినందనీయం. అయితే పాశ్చాత్య ముసుగులో పడి ఆన్‌లైన్ స్నేహాలు చేయవద్దు.

– కోల కిరణ్‌కుమార్, డైట్ వైస్ ప్రిన్సిపాల్, ఆదిలాబాద్

జాగ్రత్తగా ఉండాలి



ఆన్‌లైన్ స్నేహాలపై జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే దాని పర్యావసానం ఎదుర్కొవాల్సి ఉంటుంది. ఇటీవల జరుగుతున్న సైబర్ క్రైమ్‌ల్లో ఆన్‌లైన్ స్నేహం ముసుగులో జరిగేవే ఎక్కువగా ఉంటున్నాయి. చాలామంది మోసపోతున్నారు. ఛాత్రోపాధ్యాయులుగా ఈ విషయాలు నేర్చుకుని విద్యార్థులకు అవగాహన కల్పించాలి. – జయశీల, ఎంఈవో, ఆదిలాబాద్

మోసపోవద్దు..



ఆన్‌లైన్‌లో ముక్కు, మొఖం తెలియని వారితో స్నేహం చేయడం మంచిది కాదు. ఇటీవల ఇందులో మహిళలు మోసాలకు గురవుతున్న తీరు మనం చూస్తూనే ఉన్నాం. ఆన్‌లైన్‌లో వ్యక్తిగత విషయాలను షేర్ చేయవద్దు. ముఖ్యంగా మహిళలు అప్రమత్తంగా ఉండాలి.

– స్వర్ణకుమారి, డైట్ అధ్యాపకురాలు

ఆఫ్‌లైన్ స్నేహమే బెటర్



ఆన్‌లైన్‌లో స్నేహమంటే నష్టాన్ని కొని తెచ్చుకోవడమే. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయి. గుర్తు తెలియని వ్యక్తులు తప్పుడు డీపీలు, ఐడీల పేరిట మోసాలకు పాల్పడుతున్నారు. సెల్‌ఫోన్ లేని రోజుల్లో ఫ్రెండ్‌షిప్‌ను ఉత్తరాల ద్వారా కష్టాసుఖాలు పంచుకునేవాళ్లం. దీని ద్వారా బంధం ఎంతో బలపడేది.

– ఆర్.శివకుమార్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు

అమ్మాయిలు అధికంగా నష్టపోతున్నారు





ప్రస్తుత సమాజంలో నమ్మకం లేని ఆన్‌లైన్ స్నేహాలు ఎక్కువవుతున్నాయి. ఇలాంటి వాటి ద్వారా ఎదుటివారి ఉద్దేశాలు బయటపడవు. అపరిచిత వ్యక్తులతో స్నేహం శ్రేయస్కరం కాదు. మోసపూరిత స్నేహాల వలన అమ్మాయిలు అధికంగా నష్టపోతున్నారు.

– కే వైష్ణవి, ఎస్ వైష్ణవి, ఛాత్రోపాధ్యాయినులు

సమస్యలు రాకుండా కొనసాగించవచ్చు..



ఆన్‌లైన్ స్నేహం నేరమేమీ కాకపోయినా.. స్వీయ జాగ్రత్తలు తప్పనిసరి. నమ్మి వారితో మన విషయాలన్నింటినీ పంచుకుంటే అనర్థాలు జరిగే అవకాశాలు లేకపోలేదు. స్నేహం చేసే ముందు మనం అవతలి వ్యక్తిని కలిసి ఉంటే, అతని గురించిన విషయాలు తెలుసుకుంటే సమస్యలు రాకుండా కొనసాగించవచ్చు.

– గజేందర్, ఛాత్రోపాధ్యాయుడు

డీపీలు మారుస్తున్నారు



గతంలో మన చుట్టూ పరిచయం ఉన్న వాళ్లతోనే స్నేహం ఉండేది. ప్రస్తుతం స్మార్ట్ ఫోన్ల కారణంగా ఆన్‌లైన్ స్నేహాలు పెరిగిపోయాయి. కొంతమంది అమ్మాయిల డీపీలు పెట్టుకొని అబ్బాయిలు, అబ్బాయిల డీపీలతో అమ్మాయిలు నయవంచనకు గురి చేస్తున్నారు. ఇలాంటి వాటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. పర్సనల్ విషయాలు చెప్పొద్దు.

– అంజలి, ఛాత్రోపాధ్యాయిని

సమస్యలెక్కువ..





ఆన్‌లైన్ స్నేహంలో మోసాలు, సమస్యలెక్కువ. నిజాయతీగా, నిర్భయంగా ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ చేయలేము. అదే ఆఫ్‌లైన్ స్నేహమైతే నమ్మకంతో పరస్పరం విషయాలను పంచుకోవచ్చు. అందుకే ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌కు దూరంగా ఉండడం బెటర్.

– జీజాంజలి, రోహిణి, ఛాత్రోపాధ్యాయులు

నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి



ప్రతి ఒక్కరి జీవితంలో స్నేహం ఎంతో కీలకం. అలాంటి స్నేహాన్ని ఎంచుకోవడం మన పైనే ఆధారపడి ఉంటుంది. ఆన్‌లైన్ స్నేహమైనా, ఆఫ్‌లైన్ స్నేహమైనా ప్రయోజనాలు, అనర్థాలు ఉంటాయి. నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ముందుకు సాగినప్పుడే స్నేహంలోని నిజాయతీ నిలబడుతుంది.

– హర్షిత, ఛాత్రోపాధ్యాయిని

స్నేహం జీవితాంతం ఉండాలి



కష్ట సుఖాల్లో తోడుగా నిలిచేదే నిజమైన స్నేహం. ఒక్కసారి స్నేహం చేస్తే జీవితాంతం కలిసి ఉండాలి. అయితే ప్రస్తుతం ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్‌లో చిన్న చిన్న విషయాలకే బ్లాక్ మెయిల్ చేస్తూ పలువురు ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీంతో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం లేకపోలేదు.

– కోమల్, ఛాత్రోపాధ్యాయిని

ఆ స్నేహంపై నమ్మకముండదు..



ప్రతి అనుబంధానికి నమ్మకమే పునాది. నమ్మకం లేని చోట స్నేహానికి చోటు ఉండదు. మనం ఫ్రెండ్‌షిప్ చేసే వ్యక్తి ప్రవర్తన, స్వభావం తెలిసి ఉండాలి. మన ఇష్టాలు, అభిప్రాయాలు పంచుకోవాలని మనకు అనిపించాలి. ఆన్‌లైన్ ద్వారా ఆ ఎదుటి వ్యక్తి ప్రవర్తనను మనం ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం ఉండదు. అలాంటప్పుడు ఆ వ్యక్తిత్వాన్ని అంచనా వేయలేము. దీంతో ఆ స్నేహంపై నమ్మకం కుదరదు. కాబట్టి మన చుట్టూ ఉండే వ్యక్తులతోనే స్నేహం చేయడం మంచిదని నా అభిప్రాయం. – కావ్య, ఛాత్రోపాధ్యాయిని

ఆన్‌లైన్.. అవసరమే పడదు



జీవితంలో స్నేహితుడు కీలకం. మన కష్టాలు, అనుభూతులను పంచుకోవడంలో ఎల్లప్పుడు ముందుంటాడు. అయితే నేడు మొబైల్ ఫోన్లకే అతుక్కుపోతున్న కొంతమంది చుట్టూ ఉండే స్నేహితులకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో ఆన్‌లైన్ స్నేహాలకు మొగ్గుచూపుతున్నారు. గంటల తరబడి చాటింగ్ చేస్తూ వ్యక్తిగత విషయాలను షేర్ చేస్తున్నారు. తీవ్ర నష్టానికి గురవుతున్నారు. సమీప స్నేహితులకు ప్రాధాన్యత ఇస్తే ఆన్‌లైన్ స్నేహాల అవసరమే పడదు.

– నవీన్, ఛాత్రోపాధ్యాయుడు

కేసుల పరిష్కారంలో ముందుండేలా కృషి

- జిల్లా జడ్జి వీఆర్ఆర్.వరప్రసాద్

ఆదిలాబాద్‌టౌన్: లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కరించి రాష్ట్రంలోనే ఆదిలాబాద్‌ను మంచి స్థానంలో నిలబెట్టేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. సెప్టెంబర్ 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌పై శనివారం జిల్లా కోర్టులో పోలీసులు, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ, రాజీపడే అవకాశమున్న కేసుల వివరాలను స్టేషన్లవారీగా తెలుసుకుంటూ కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సెప్టెంబర్ 9న నిర్వహించే లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు పరిష్కరించి



మాట్లాడుతున్న జిల్లా జడ్జి వరప్రసాద్

రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాల్లో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, న్యాయమూర్తులు శివ రాంప్రసాద్ రావ్, దుర్గారాణి, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, పీపీలు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

- ఆధునికీకరణ పనులకు నేడు శ్రీకారం
- వర్చువల్ విధానంలో ప్రారంభించనున్న ప్రధాని మోదీ
- ఏర్పాట్లు పరిశీలించిన పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఆధునికీకరణ ద్వారా ఆదిలాబాద్ రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఇటీవల అమృత్ స్టేషన్ పథకం కింద జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ ఎంపికైందని. ఈమేరకు ప్రధాని మోదీ ఆదివారం వర్చువల్ విధానంలో పనులు ప్రారంభించనున్నారు. కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాటన్లు శంకర్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు కేంద్రం రూ.17.8 కోట్ల నిధులు వెచ్చించనున్నట్లు తెలిపారు. ప్రయాణికులకు మరింత మెరుగైన సేవలు అందుతాయన్నారు. ఇందుకోసం ఎంపీ సోయం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పాయల్ శంకర్

బాపూరావు ఎంతగానో కృషి చేశారన్నారు. వర్చువల్ కార్యక్రమంలో ఆదిలాబాద్–నిర్మల్ మీదుగా హైదరాబాద్ వరకు రైల్వే లైన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనను తెలియజేస్తామన్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చిట్యాల సుహాసినిరెడ్డి సైతం పనులను పరిశీలించారు. కార్యక్రమంలో దక్షిణ మధ్య రైల్వేబోర్డు మెంబర్ జీవీ రమణ, నాయకులు జోగు రవి, దినేష్ మటోలియా తదితరులు ఉన్నారు

మళ్లీ.. విత్తనం!

- భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలు
- అన్నదాతకు తీవ్ర నష్టం
- మరోసారి పత్తి వైపే చూపు
- స్వల్పకాలిక పంటలు మేలంటున్న అధికారులు



భీంపూర్ మండలం అర్లి–టి గ్రామానికి చెందిన ఈ రైతు పేరు గజానన్. వానాకాలం సాగులో భాగంగా తన కున్న ఎనిమిదెకరాల్లో పత్తి సాగు చేశాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెన్‌గంగ ఉప్పొంగడంతో పంట వరదలో కొట్టుకుపోయింది. చేసేది లేక మళ్లీ నాలుగు ఎకరాల్లో పత్తి విత్తనాలు విత్తాడు. ఈ ఒక్క రైతే కాదు.. జిల్లాలో చాలామంది ఇలాగే తిరిగి విత్తనాలు నాటుతున్నారు. అదును దాటడంతో పత్తి సాగుతో ప్రయోజనం ఉండదని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. స్వల్పకాలిక పంటలపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

కైలాస్‌నగర్: గత నెలలో ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాలు అన్నదాతకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వానాకాలం సాగులో భాగంగా నాటిన పత్తి, కంది, సోయా పంటలు వరద కారణంగా కొన్నిచోట్ల కొట్టుకుపోగా, మరి కొన్నిచోట్ల పూర్తిగా జలమయమయ్యాయి. రోజుల తరబడి నీళ్లలో ఉండటంతో మొక్కలు కుళ్లిపోయాయి. పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో ప్రభావం అధికంగా ఉంది. నష్టాన్ని అధిగమించాలనే ఆశతో కొంతమంది రైతులు మళ్లీ చేలల్లో పత్తి విత్తనాలు విత్తుతున్నారు. అయితే పత్తి, సోయాకు అదును దాటడంతో ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పంటల సాగు చేపడితేనే ప్రయోజనం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

16,290 ఎకరాల్లో పంట నష్టం

వానాకాలం సాగులో భాగంగా జిల్లాలో రైతులు అత్యధికంగా పత్తి, కంది, సోయ సాగు చేస్తుంటారు. సీజన్ ఆరంభంలో కరుణించని వరుణుడు జూలైలో మాత్రం కుండపోతగా వర్షాలు కురిపించాడు. పెన్‌గంగ ఉప్పొంగడంతో వరదలు సంభవించాయి. జిల్లావ్యాప్తంగా 16,290 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 8,301 మంది రైతులకు నష్టం వాటిల్లింది. ఇందులో 10,880 ఎకరాల్లో పత్తి, 3,223 ఎకరాల్లో సోయా 2,187 ఎకరాల్లో కంది పంటలు దెబ్బతిన్నాయి.

అదును దాటింది..

ప్రస్తుతం వరద తగ్గడంతో నీట మునిగిన పంటలు బయటపడుతున్నాయి. అయితే రోజుల తరబడి మొక్కలు నీళ్లలో ఉండటం, కొన్నిచోట్ల కొట్టుకుపోవడంతో పంటలు వచ్చే పరిస్థితి లేదు. ఈ క్రమంలో చేలను ఖాళీగా ఉంచకుండా కొంతమంది రైతులు తిరిగి పత్తి సాగు చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే పత్తిని జూలై మొదటి వారం వరకు, సోయాను జూలై నెలాఖరు వరకు సాగుచేసే అవకాశముంటుంది. ప్రస్తుతం అదును దాటడంతో వాటిని సాగు చేసినా దిగుబడి ఆశాజనకంగా ఉండదని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు చెబుతున్నారు. పత్తి పూతదశలో చలితీవ్రత ఎక్కువగా ఉండి రాలిపోయే అవకాశముటుందని, అలాగే పురుగు ఉధృతి కూడా ఎక్కువగా ఉండే ప్రమాదం ఉంటుందంటున్నారు. ఈ క్రమంలో రైతులు ప్రత్యామ్నాయంగా స్వల్పకాలిక పంటల వైపు వెళ్లడం ఉత్తమమని అధికారులు సూచిస్తున్నారు.

స్వల్పకాలిక పంటలు మేలు..

పంట దెబ్బతిన్న రైతులు ప్రస్తుతం కంది, పెసర, మినుము, మక్క, నువ్వులు వంటి స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవచ్చని అధికారులు సూచిస్తున్నారు. వీటికి మద్దతు ధర కూడా ఎక్కువగా ఉందని చెబుతున్నారు. కందులు క్వింటాల్‌కు రూ.7వేలు, పెసరకు రూ.8,558, మినుముకు రూ.6,950, మక్కలకు 2,090, నువ్వులకు అత్యధికంగా రూ.8,635 ఉంది. మూడు నెలల్లోనే పంట చేతికొచ్చే అవకాశముండడంతో రైతులు వీటిని సాగు చేస్తే ప్రయోజనం ఉంటుందని చెబుతున్నారు.

నష్టపరిహారంపై గంపెడాశ

పంట నష్టపోయిన రైతులు ప్రభుత్వ చేయూత కోసం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. పెట్టుబడి కోసం చేతిలో చిల్లిగవ్వలేకపోయినా పంట పండుతుందనే ఆశతో అప్పో, సోప్పో చేసి మళ్లీ విత్తనాలు విత్తుతున్నారు. త్వరలో కేంద్ర బృందం జిల్లాలో పర్యటించే అవకాశముండటంతో వారి రాక కోసం ఎదురుచూస్తున్నారు.

స్వల్పకాలిక పంటలు సాగు చేస్తే ప్రయోజనం

భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి. పత్తి, సోయా విత్తనాలను నాటే దశ జూలై నెలాఖరుతో దాటిపోయింది. ఇప్పుడు నాటితే ప్రయోజనం ఉండకపోవచ్చు. పెసర, మినుము, కంది, నువ్వులు వంటి స్వల్పకాలిక పంటలు సాగు చేసుకోవాలి. తద్వారా పంట నష్టాన్ని అధిగమించవచ్చు. నీటి వసతి కలిగిన రైతులు కూరగాయలను సైతం సాగు చేసుకోవచ్చు.

– డి.పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

డేద్రలో హెల్త్‌ క్యాంపు



వైద్య పరీక్షలు చేస్తున్న మెడికల్‌ అధికారి

సాక్షి స్పందన

బజార్‌హత్నూర్‌: మండలంలోని డేద్ర గ్రామానికి చెందిన మూడేళ్ల గిరిజన బాలుడు పంద్ర పరుశురాం వైద్యం అందక మృతి చెందగా ఈ ఘటనను సాక్షిలో 'బురద రోడ్లు.. ఆపై వైద్యులు లేరు' అనే కథనం రావడంతో స్పందించిన వైద్య సిబ్బంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్‌ ఆఫీసర్‌ భీంరావ్‌ ఆధ్వర్యంలో శనివారం డేద్ర గ్రామంలో హెల్త్‌క్యాంపు నిర్వహించారు. 30 మందికి ఆరోగ్య పరీక్షలు చేసి వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈవో సూర్యప్రకాష్‌, సూపర్‌వైజర్‌ దేవిదాస్‌, భాస్కర్‌రావ్‌, హెల్త్‌అసిస్టెంట్‌ గాజులు రమేష్‌, అన్నపూర్ణ పాల్గొన్నారు.

కుక్కల దాడిలో చుక్కలదుప్పి మృతి



దుప్పి కళేబరం

ఖానాపూర్‌: మండలంలోని ఎర్వచింతల్‌ అటవీ ప్రాంతంలో శనివారం కుక్కల దాడిలో చుక్కల దుప్పి మృతిచెందిందని ఎఫ్‌ఆర్‌వో వినాయక్‌ తెలిపారు. గ్రామ శివారులోని అటవీ ప్రాంతంలో ఊర కుక్కలు వెంబడించి దాడి చేయడంతో దుప్పి తీవ్రంగా గాయపడింది. దీంతో ఎఫ్‌బీవో నారాయణ, సిబ్బంది ప్రథమ చికిత్స అందించి ఖానాపూర్‌ తరలించే క్రమంలో మృతి చెందింది. అనంతరం దుప్పిని అక్కడే ఖననం చేశారు.

పాముకాటుకు ఎద్దు మృతి



ఎద్దు కళేబరం

సిరికొండ: పాము కాటుకు ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు అజ్గర్‌కు చెందిన ఎద్దు శనివారం చేనులో ఉండగా పాము కాటుకు గురైంది. రైతు వెంటనే వైద్యులను పిలిచి చికిత్స చేపించినా ఫలితం కానరాలేదు. దాని విలువ రూ.40వేలు ఉంటుందని బాధిత రైతు వాపోయాడు.

గుడుంబా పట్టివేత



బైండోవర్‌ చేస్తున్న పోలీసులు

ఖానాపూర్‌: మండలంలోని బాదన్‌కూర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్‌కు చెందిన జీ.శేఖర్‌ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతడి వద్ద నుంచి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాయబారపు రవి తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌ మంజుల వద్ద ముందస్తుగా బైండోవర్‌ చేశామని పేర్కొన్నారు. ఎవరైనా గుడుంబా విక్రయిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది రశీద్‌, ప్రకాశ్‌, గౌతం, రవీందర్‌, కల్పన ఉన్నారు.

పల్లెకు చేరువయ్యేలా..!



పల్లెటూరుతో ఆర్టీసీ బస్సుది విడదీయరాని అనుబంధం.. ఒకప్పుడు ఎర్ర బస్సు కనిపిస్తే చాలు.. తమ ఇంటికి బంధువులు వచ్చారేమో.. అని కేరింతలు కొడుతూ.. దాని చుట్టూ చిన్నారులు కలియదిరిగేవారు. బస్సు ఊరిలో హాల్టింగ్‌ చేస్తే డ్రైవర్‌, కండక్టర్లను తమ సొంత ఇంటి మనుషుల్లా భావించి గ్రామస్తులు మర్యాద చేసేవారు.. ఇలా ఒకటేమిటి.. ఎన్నో జ్ఞాపకాలు.. ఆర్టీసీ ఆర్థికంగా వెలగడానికి గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సుల పాత్ర ఎంతో కీలకం.. అలాంటి పల్లెటూర్లకు ఆర్టీసీని మరింతగా చేరువ చేసేలా సంస్థ ఉన్నతాధికారులు పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

- గ్రామీణ ప్రయాణికులే ఆర్టీసీ లక్ష్యం
- వినూత్న స్కీంలు, సబ్సిడీ ప్రకటనలు
- ఆదాయార్జనే ధ్యేయం టీఎస్‌ ఆర్టీసీ

ఆదిలాబాద్‌: ప్రయాణికులకు మరింత చేరువయ్యేలా టీఎస్‌ ఆర్టీసీ వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోంది. శుభకార్యాలు, పండుగలు, ప్రత్యేక సమయాల్లో పలు ఆకర్షణీయమైన పథకాలతో ప్యాసింజర్లకు దగ్గరవుతూనే రాయితీలను ప్రకటిస్తూ ఆకట్టుకుంటోంది. ఆర్టీసీలో ఎక్స్‌ప్రెస్‌ సర్వీసుల కన్నా పల్లె వెలుగు బస్సులే అధికంగా నడుస్తుంటా యి. పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణించే వారిని ఆకర్షించడమే ధ్యేయంగా అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకుసాగుతున్నారు. ప్రస్తుతం టీ–9, టీ 9–30 టికెట్ల పేరుతో కొత్త పథకాలను ప్రవేశపెట్టి సంస్థ ఆదాయాన్ని పెంచేలా చర్యలు తీసుకుంటున్నారు.

ఆర్థిక భారం తగ్గించేలా..

గ్రేటర్‌ హైదరాబాద్‌ పరిధిలో ప్రయాణికుల సౌకర్యార్థం టీ–24 టికెట్‌ సర్వీసును ఆర్టీసీ అందుబాటులోకి తీసుకువచ్చింది. టీ–24 టికెట్‌ను రూ.100తో కొనుగోలు చేసి నగర పరిధిలో 24 గంటలపాటుపాటు ప్రయాణం చేయవచ్చు. హైదరాబాద్‌ నగర ప్రయాణికుల నుంచి ఈ టికెట్‌ సేవలకు భారీ స్పందన లభించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ టీ–24 లాగా టీ9–60 టికెట్‌ సర్వీస్‌ను పల్లెవెలుగు బస్సుల్లో ఆర్టీసీ ప్రవేశపెట్టింది. టీ 9–60 టికెట్‌కు రూ.100 నిర్ణయించారు.



విలేజ్‌ బస్సు అధికారులకు శిక్షణ ఇస్తున్న ఆర్‌ఎం

అంతర్రాష్ట్ర సర్వీసులకూ..

ఇక టీ9–60, టీ9–30 టికెట్లను పల్లెవెలుగు బస్సు కండక్టర్ల వద్ద తీసుకోవచ్చు. ప్రతిరోజూ సాయంత్రం 6గంటల వరకు ఈ టికెట్లు తీసుకునే అవకాశం కల్పించారు. 30 కిలోమీటర్ల పరిధిలో ఉన్న ఇతర రాష్ట్రాలకు కూడా ఈ టికెట్‌ సర్వీస్‌ వర్తిస్తుంది. టీ9–30 టికెట్‌ సర్వీస్‌ జూలై 27వ తేదీన ప్రారంభించగా నెలపాటు అందుబాటులో ఉంచి ప్రయాణికుల స్పందన అనుసరించి, సర్వీస్‌ గడువును పెంచాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

పథకాలు వివరిస్తూ..

పల్లెవెలుగు బస్సుల్లో ప్రయాణించే గ్రామీణ ప్రాంత ప్రజలే ఆర్టీసీకి ప్రధాన ఆదాయవనరు. సాధారణంగా ప్రతీ గ్రామం నుంచి మండల కేంద్రాలు, జిల్లా కేంద్రాలకు ప్రజలు వివిధ పనుల కోసం వస్తుంటారు. ఈ నేపథ్యంలో రహదారి సౌకర్యం ఉన్న ఆయా గ్రామాలకు ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను నడుపుతోంది. వారిని ఆకట్టుకునేలా పలు పథకాలనూ అమలు చేస్తోంది. ఈ సమాచారాన్ని గ్రామీణ ప్రాంత ప్రయాణికులకు ఎప్పటికప్పుడు తెలియజేయాలనే ఉద్దేశంతో విలేజ్‌ బస్‌ ఆఫీసర్‌ వ్యవస్థను ఇటీవల ఆర్టీసీ ఏర్పాటు చేసింది.

30కిలో మీటర్ల దూరంలో..

ఇక ఈ టీ9–60 టికెట్‌ను ప్రయాణికులు ఆదరించడంతో సేవలు అమాంతం పెరిగాయి. పల్లెవెలుగు బస్సుల్లో 30 కిలోమీటర్ల పరిధిలో స్వల్పదూరం ప్రయాణించే వారి కోసం ఈ రాయితీ పథకాన్ని ప్రకటించింది. రూ.50 చెల్లించి ఈ టికెట్‌ తీసుకున్న వారు 30 కిలోమీటర్ల పరిధిలో పల్లె వెలుగు బస్సులు ఉదయం తొమ్మిది నుంచి రాత్రి 9 గంటల వరకు రానుపోను ప్రయాణించవచ్చు. దీంతో ప్రయాణికులకు రూ.10 నుంచి రూ.30 వరకు ఆదా అవుతున్నాయి. ఇక టీ9–30 టికెట్‌ తీసుకున్న వారు తిరుగు ప్రయాణంలో ఎక్స్‌ప్రెస్‌ బస్సుల్లో ప్రయాణించాలనుకుంటే రూ.20 కాంబీ టికెట్‌ తీసుకునే సదుపాయాన్ని కల్పించింది.



టీ 9-60, టీ 9-30 బస్సు టికెట్ల పోస్టర్‌

మెరుగైన సేవలందించేందుకు కృషి



ఆర్టీసీ సేవలను క్షేత్రస్థాయిలో ప్రయాణికులకు తెలియజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇందుకు ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. గేట్‌ మీటింగ్‌, ప్రత్యేక సమావేశాల ద్వారా సేవలను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తున్నాం. టీ 9–60, టీ9–30 టికెట్లను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఆర్టీసీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందజేయడానికి కృషి చేస్తున్నాం.

– సోలోమన్‌, ఆర్టీసీ ఆర్‌ఎం, ఆదిలాబాద్‌

బాధ్యతలు స్వీకరించిన ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి



రమణమూర్తి

ఆదిలాబాద్‌టౌన్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఏసీబీ డీఎస్పీగా రమణమూర్తి శనివారం బాధ్యతలను స్వీకరించారు. 1996 ఎస్సై బ్యాచ్‌కి చెందిన ఆయన ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని తిర్యాని, ఉట్నూర్‌, జైపూర్‌, నెన్నెల, హాజీపూర్‌, లక్సెట్టిపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించారు. సీఐగా పదోన్నతి తర్వాత ఇన్స్‌పెక్టర్‌ ఏసీబీగా కరీంనగర్‌ రేంజ్‌ (ఉమ్మడి కరీంనగర్‌, ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా)లోనూ, కరీంనగర్‌ జిల్లా హుజురాబాద్‌లో, ఆసిఫాబాద్‌ జిల్లా రెబ్బెన, ఆదిలాబాద్‌ జిల్లా నార్నూర్‌ సర్కిల్‌లోనూ సీఐగా పనిచేశారు. ప్రస్తుతం ట్రాన్స్‌కో విజిలెన్స్‌ విభాగంలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న ఆయన ఇటీవల డీఎస్పీగా పదోన్నతి పొందారు.

ఇంకుడుగుంతలు పరిశీలించిన ఢిల్లీ బృందం



గుంతలు పరిశీలిస్తున్న అధికారులు

బోథ్‌: మండలంలోని పొచ్చర గ్రామంలో ఢిల్లీ నుంచి వచ్చిన అధికారుల బృందం శనివారం పర్యటించారు. మరుగుదొడ్లు, సెగ్రిగేషన్‌ షెడ్లు, ఇంకుడు గుంతలు, మురికి కాలువలను పరిశీలించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీలను సందర్శించారు. పారిశుద్ధ్య నిర్వహణపై అధికారులతో మాట్లాడారు. వారి వెంట పీడీ కిషన్‌, ఎంపీడీవో సుశీల్‌రెడ్డి, ఏపీవో జగ్గేరావ్‌ ఉన్నారు.

బస్సును ఢీకొన్న కంటైనర్‌

నిర్మల్‌టౌన్‌: జిల్లా కేంద్రంలోని శివాజీచౌక్‌లో శనివారం తెల్లవారుజామున ప్రైవేటు బస్సును కంటైనర్‌ ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆదిలాబాద్‌ నుంచి నిర్మల్‌ మీదుగా ప్రైవేట్‌ బస్‌ హైదరాబాద్‌ వెళ్తుంది. అదే సమయంలో హైదరాబాద్‌ నుంచి నిర్మల్‌ వైపు వస్తున్న కంటైనర్‌ బస్సును వెనుక భాగంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు గాయాలు కాగా చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఐదు ఆధార్‌ సెంటర్లపై వేటు

- తప్పుడు పత్రాలను జతచేసిన ఫలితం

కైలాస్‌నగర్‌: ఆదిలాబాద్‌ జిల్లాలోని ఐదు ఆధార్‌ కేంద్రాలపై యూనిక్‌ ఐడేంటిఫికేషన్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా (యూఐడీఏఐ) వేటు వేసింది. ఆ కేంద్రాల ద్వారా అందించే సేవలను నిలిపివేస్తూ నిర్వాహకుల ఆథరైజేషన్‌ను సస్పెండ్‌ చేసింది. దీంతో ఆదిలాబాద్‌ జిల్లా వ్యాప్తంగా ఐదు కేంద్రాల నిర్వాహకులు ఆధార్‌ సంబంధిత సేవలందించేందుకు దూరమవాల్సిన దుస్థితి నెలకొంది. అడ్రస్‌ మార్పునకు సంబంధించి తప్పుడు వివరాలతో కూడిన ధృవీకరణ పత్రాలను జత చేసినందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యల ద్వారా ఆదిలాబాద్‌ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌ కార్యాలయం, భుక్తాపూర్‌లోని సెంటర్‌తో పాటు, తలమడుగు, బేల, ఇంద్రవెల్లి మండల కేంద్రాల్లోని ఆధార్‌ కేంద్రాలపై వేటు పడింది. ఇందులో ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆధార్‌ సెంటర్‌ను ఇది వరకే సస్పెన్షన్‌ వేటు వేయగా తాజాగా మిగతా సెంటర్లపై చర్యలు చేపట్టింది. ఆధార్‌ సంస్థ చేపట్టిన చర్యల విషయం తెలియకపోవడంతో నిత్యం ఆధార్‌ సంబంధిత సేవల కోసం వస్తున్న ప్రజలు ఆ సెంటర్లు మూసి ఉండటంతో గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తుంది. కేంద్రాలపై చర్యలు చేపట్టిన విషయాన్ని



కలెక్టరేట్‌లో మూసి ఉన్న ఆధార్‌ సెంటర్‌

ప్రజలకు సమాచారమందించాల్సిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది.

ఏమరుపాటుగా ఉంటే వేటు తప్పదు...

ఆధార్‌ కేంద్రాల నిర్వాహకులు ఏమాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా శాఖపరంగా చర్యలు ఎదుర్కొనక తప్పదని తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ, అభివృద్ధి పథకాలు పొందాలన్నా, పోటీ పరీక్షలు, విద్యా, ఉద్యోగాలకు దరఖాస్తు చేయాలన్న ప్రభుత్వాలు ఆధార్‌ కార్డును తప్పనిసరి చేశాయి. అంతటి కీలకమైన ఆధార్‌ కార్డుల జారీలో తప్పుడు సమాచారం పొందుపరిచినట్లు తేలితే ఆధార్‌ సేవ కేంద్రాలనే బాధ్యులను చేస్తూ ఆధార్‌ సంస్థ వారిపై చర్యలు చేపడుతోంది.

నాణ్యతతో కూడిన విద్య బోధించాలి



మాట్లాడుతున్న పీవో చాహత్‌ బాచ్‌పాయ్‌



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

ఉట్నూర్‌రూరల్‌: ఆశ్రమ వసతి గృహాల్లో, గురుకుల పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యను అందించాలని ఐటీడీఏ పీవో చాహత్‌ బాచ్‌పాయ్‌ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కొమురంభీం కాంప్లెక్స్‌ పీఎంఆర్‌సీ మీటింగ్‌ హాల్‌లో 38 ఆశ్రమ, గురుకుల పాఠశాలల నుంచి వచ్చిన ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఐసీటీ బోధకులు, గణితశాస్త్ర ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఒక రోజు శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అమెజాన్‌ ఫ్యూచర్‌ ఇంజినీర్‌, పీజీ వారి సౌజన్యంతో కార్పొరేట్‌ సోషల్‌ రెస్పాన్స్‌ (సీఎస్‌ఆర్‌) కార్యక్రమంలో భాగంగా ఐటీడీఏ ఉట్నూర్‌ కేంద్రంగా ఆదిలాబాద్‌, మంచిర్యాల, నిర్మల్‌ జిల్లాలోని 34 ఆశ్రమ పాఠశాల ల్లోని నాలుగు గురుకుల పాఠశాలల్లో కార్పొరేట్‌ స్థాయిలో కంప్యూటర్‌ విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రతీ పాఠశాలలో కంప్యూటర్‌ ల్యాబ్‌, ఫర్నీచర్‌ తదితర సౌకర్యాలను కల్పిస్తూ పిల్లలకు కంప్యూటర్‌ సైన్స్‌, కోడింగ్‌ ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ అంశాల్లో బోధన చేస్తూ గణితం, ఇంగ్లిష్‌, తెలుగు విషయాలను అనుసంధానం చేస్తూ నేటి సమాజ పోకడలకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేయడమే లక్ష్యంగా అమెజాన్‌ ఫ్యూచర్‌ ఇంజినీర్‌ సంస్థ కృషి చేస్తోందని తెలిపారు. సంస్థ మేనేజర్‌ వికాస్‌కుమార్‌, ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్‌, ఆర్‌సీవో గంగాధర్‌, మంచిర్యాల్‌ డీటీడీవో నిలిమ, నిర్మల్‌ డీటీడీవో అంబాజీ ఉన్నారు.

న్యాయ సహాయంపై అవగాహన

ఆదిలాబాద్‌టౌన్‌: ఖైదీలు లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సెల్‌ సిస్టమ్‌ ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందవచ్చని ఆ కౌన్సిల్‌ సభ్యులు తెలిపారు. సుప్రీం కోర్టు, హైకోర్టు ఆదేశాలతో నియమించిన లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సెల్‌ సభ్యులు శనివారం జిల్లా జైలును సందర్శించారు. ఖైదీలతో మాట్లాడి వారి కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ డిఫెన్స్‌ కౌన్సెల్‌ సిస్టమ్‌ ద్వారా ప్రతి ఖైదీ న్యాయ సేవలను పొందేందుకు అర్హులని తెలిపారు. ఈ కార్యక్రమంలో లీగల్‌ ఎయిడ్‌ డిఫెన్స్‌ కౌన్సెల్‌ స్కీమ్‌ ప్రధాన న్యాయవాది గంగారాం దాసరి, ఉప సహాయ న్యాయవాది అరుగుల అశోక్‌, సహాయ న్యాయవాది ఉమేష్‌, జైలర్లు సూర్య ప్రకాష్‌ రెడ్డి, మధు పాల్గొన్నారు.

డ్రంకెన్‌ డ్రైవ్‌లో ముగ్గురికి జైలు

దస్తురాబాద్‌: మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధిస్తూ శనివారం ఖానాపూర్‌ సివిల్‌ జడ్జి జితిన్‌ కుమార్‌ తీర్పు ఇచ్చారని ఎస్సై ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... మండల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఖానాపూర్‌, జన్నారం మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. వారిపై కేసు నమోదు చేసి ఖానాపూర్‌ కోర్టుకు తరలించారు. ముగ్గురికి మూడు రోజుల పాటు జైలు శిక్ష విధిస్తూ ఖానాపూర్‌ సివిల్‌ జడ్జి జితిన్‌కుమార్‌ తీర్పును వెల్లడించారు. అలాగే మరో 9మందికి రూ. 2వేల జరిమానా విధించారు.


దాడి చేసిన ఒకరిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్‌: దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్‌ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన చింతకుంట్ల సాయికుమార్‌పై అదే కాలనీకి చెందిన సంతోష్‌ దాడికి పాల్పడ్డాడు. పట్టణంలోని విద్యుత్‌ తరంగిణి ఫంక్షన్‌హాల్‌లో వీరిద్దరూ వంట చేస్తున్న సమయంలో సాయికుమార్‌ ఆకుల సంతోష్‌ను అంబర్‌ ఎందుకు తింటున్నావని మందలించాడు. ఆగ్రహించిన సంతోష్‌ సాయికుమార్‌పై దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లుగా పేర్కొన్నారు.

మట్కా నిందితుల అరెస్ట్‌

కైలాస్‌నగర్‌: పట్టణంలోని సంజయ్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి ఇద్దరిని పట్టుకున్నారు. సీసీఎస్‌ ఇన్‌చార్జి ఇన్స్‌పెక్టర్‌ జె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దాడిచేయగా తాంసి మండలం ఘోట్కూరికి చెందిన నిమ్మల రవి, పట్టణంలోని తాటిగూడకు చెందిన షేక్‌ మొహమ్మద్‌, తాంసి మండల కేంద్రానికి చెందిన షేక్‌ మతిన్‌లు ఉండగా వీరిలో ఒకరు పరారీ కాగా ఇద్దరిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లుసీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.7240 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నారు.

రిమ్స్‌లో జారిపడిన కార్మికుడికి గాయాలు



పరీక్షిస్తున్న రిమ్స్‌ డైరెక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌


ఆదిలాబాద్‌టౌన్‌: పట్టణంలోని రిమ్స్‌లో విధి నిర్వహణలోని ఓ కార్మికుడు మొదటి అంతస్తులోని సజ్జ నుంచి శనివారం ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రగాయాల పాలయ్యాడు. కాంట్రాక్ట్‌ ప్రతిపాదికన పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్న గంగన్న విధుల్లో భాగంగా మొదటి అంతస్తులోని సజ్జపై ఉన్న చెత్తను శుభ్రపరుస్తున్నాడు. ఈ క్రమంలో సజ్జపై ఉన్న పాకురు కారణంగా కాలు జారీ కింద పడిపోయాడు. దీన్ని గమనించిన కార్మికులు వెంటనే రిమ్స్‌లోని అత్యవసర వార్డుకు తరలించి వైద్యులకు సమాచారమందించారు. ఈ విషయం తెలుసుకున్న రిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జైసింగ్‌ రాథోడ్‌, సూపరింటెండెంట్‌ డాక్టర్‌ అశోక్‌లు చికిత్స పొందుతున్న కార్మికుడిని పరామర్శించారు. వారు కూడా కార్మికుడిని పరీక్షించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్‌ కార్మికులకు సరైన సౌకర్యాలు కల్పించని కారణంగానే ఈ ప్రమాదం జరిగిందని తోటి కార్మికులు ఆరోపిస్తున్నారు. కాగా కార్మికుడు గంగన్న మాట్లాడుతూ సజ్జపై అన్నం, చెత్త పేరుకుపోవడంతో దాన్ని శుభ్రం చేయడానికి పైకి ఎక్కినట్లు తెలిపారు. కాలుజారి కిందపడినట్లుగా వెల్లడించారు.

కడెం ప్రాజెక్ట్‌కు ఏడేళ్లకు మళ్లీ రంగు

కడెం: కడెం ప్రాజెక్టుకు రంగులు వెలిసిపోయి గోడలు మసకబారిపోయాయి. ఎట్టకేలకు అధికారులు స్పందించి శనివారం నుంచి కలర్స్‌ వేయిస్తున్నారు. 2006లో ఈ ప్రాజెక్టుకు రంగులు వేశారు. 17ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు రంగులను వేయిస్తున్నారు. మొదటగా వైట్‌ ప్రైమర్‌ వేసి అపై కలర్స్‌ వేయనున్నట్లు తెలిపారు. రెండు టవర్‌ బిల్డింగ్‌లకు జాతీయ పతాకంలోని మూడు రంగులను వేయించాలని అధికారులు అనుకుంటున్నారు.



ప్రాజెక్ట్‌కు కలర్లు వేస్తున్న సిబ్బంది



అందాల ఘన్‌పూర్‌ జలపాతం

బోథ్‌: మండలంలోని ఘన్‌పూర్‌ జలపాతం చూపరులను ఆకట్టుకుంటోంది. మహారాష్ట్ర సరిహద్దు వద్ద ఘన్‌పూర్‌ గ్రామానికి కిలో మీటరు దూరంలోని జలపాతానికి నీరు చేరడంతో చూపరులను కట్టిపడేస్తోంది. ఘన్‌పూర్‌ చెక్‌పోస్టు నుంచి కిలో మీటరు కాలినడకన వెళితే ఈ జలపాతానికి చేరుకోవచ్చు. అయితే రోడ్డు సౌకర్యం సరిగ్గా లేక సందర్శకులు చూడలేకపోతున్నారు. రోడ్డు సౌకర్యం కల్పిస్తే జలపాతానికి సులువుగా చేరుకోవచ్చు.